క్లుప్తంగా

సీసీ కెమెరాల ఏర్పాటు



సీసీ కెమెరాలు అందిస్తున్న దాతలు

నెల్లిమర్ల: నేరాల నియంత్రణ కోసం నెల్లిమర్ల పట్టణం సహా మండలంలోని గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్‌ఐ బి.గణేష్ తెలిపారు. ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు జనసేన పార్టీ నాయకులు, విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ జానా ప్రసాద్ ఆర్థిక సహకారంతో పట్టణంలోని మొయిద జంక్షన్‌లో సీసీ కెమెరాలు శుక్రవారం ఏర్పాటు చేశారు. నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు ప్రముఖ పాత్ర పోషిస్తున్నాయని, చాలామంది సీసీల ఏర్పాటుకు ముందుకువస్తుండడం అభినందనీయమన్నారు.

సన్మానం

విజయనగరం టౌన్: నగరంలో కణపాక చైతన్య యువజన సేవా సంఘం వారు పదో తరగతిలో 585 మార్కులతో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన బి.బిందుమాధవిని శుక్రవారం సన్మానించారు. ఆ సంఘ అధ్యక్షుడు మజ్జి కాంతారావు మాట్లాడుతూ ఇదే స్ఫూర్తితో ఉన్నత చదువులు కూడా చదవాలని, జీవింతో మంచి స్థాయిలో స్థిరపడాలని ఆకాంక్షించారు.

ఘనంగా బంగారమ్మ ఆలయ వార్షికోత్సవం



బంగారమ్మ తల్లికి మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

వేపాడ: మండలంలోని చామలాపల్లి పంచాయతీ పోతుబందిపాలెంలో బంగారమ్మ ఆలయ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారికి ముర్రాటలు, చీరలు, పసుపు, కుంకుమలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. రాత్రి పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

పారిశుధ్య పనులు చేపట్టాలి

గుర్ల: గ్రామాలలో ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు చేపట్టాలని డీపీఓ డీవీ మల్లికార్జునరావు ఆదేశించారు. మండలంలో డయేరియా కేసుల నమోదు శీర్షికన సాక్షి పత్రికలో శుక్రవారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. డయేరియా ప్రబలిన చింతలపేట, వల్లాపురం గ్రామాల్లో ఆయన పర్యటించి పరిస్థితి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వీధుల్లో బ్లీచింగ్ చల్లాలని కార్యదర్శులను ఆదేశించారు. డయేరియా ప్రబలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పర్యటనలో ఎంపీడీఓ శేషుబాబు, ఈఓపీఆర్‌డీ అన్నపూర్ణదేవి, తదితరులున్నారు.

విత్తన దుకాణాల పరిశీలన



పెదమానాపురం సంత వద్ద విత్తనాల షాపులో వరి విత్తనాలు పరిశీలిస్తున్న ఏఓ అనురాధ

దత్తిరాజేరు: మండలంలోని చినకాద, మరడాం, పెదమానాపురంలలో వరి విత్తనాలు అమ్ముతున్న షాపులను ఏఓ అనురాధ శుక్రవారం తనిఖీ చేశారు. వరి విత్తనాల నాణ్యతను పరిశీలించేందుకు శాంపిల్స్ సేకరించి విశాఖపట్నం ల్యాబ్‌కు పంపిస్తామని ఏఓ తెలిపారు. వ్యాపారులు రికార్డులు సక్రమంగా నిర్వహించాలని, లేనిపక్షంలో లైసెన్స్‌లు రద్దు చేస్తామని హెచ్చరించారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

దత్తిరాజేరు: పరిసరాల పరిశుభ్రతతోనే ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండవచ్చని ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్ అన్నారు. మండలంలోని పెదకాద, గోభ్యాం గ్రామాలలో శుక్రవారం పర్యటించి మురుగు కాలువలు, తాగునీటి ట్యాంక్‌లను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం వర్షాలు పడుతున్నందున సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. తాగునీరు కలుషితం కాకుండా చర్యలు చేపట్టాలని కార్యదర్శులను సూచించారు.

ఎక్కడబడితే అక్కడ చెత్త వేయకండి

- ఎంపీడీఓ కల్యాణి

గజపతినగరం: ఇంటి పరిసర ప్రాంతాల సమీపంలో చెత్తలు వేసి రోగాల బారిన పడవద్దని ఎంపీడీఓ బి.కల్యాణి సూచించారు. గజపతినగరం మండల కేంద్రంలోని పలు వీధుల్లో శుక్రవారం ఆమె పర్యటించి, పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. అలాగే తడి, పొడి చెత్త సేకరణపై ఆరా తీశారు. చెత్తను ఎక్కడబడితే అక్కడ పారబోయకుండా పారిశుధ్య కార్మికులకు అందజేయాలని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ ఈఓ జనార్దనరావుతో పాటు పలువురు పాల్గొన్నారు.

- వానాకాలంలో సీజనల్ వ్యాధుల ముప్పు
- ప్రబలుతున్న మలేరియా, డెంగీ, టైఫాయిడ్ జ్వరాలు
- నిర్లక్ష్యం చేస్తే ప్రాణానికే ప్రమాదం
- వ్యాధి ప్రారంభంలోనే జాగ్రత్త పడాలని వైద్యుల సూచన



పూసపాటిరేగ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

వర్షాకాలం.. వ్యాధుల భయం!

పూసపాటిరేగ: వర్షాకాలం కారణంగా మారిన వాతావరణం నేపథ్యంలో ప్రతిఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. వర్షాలతో నెలకొన్న చల్లని వాతావరణానికి దగ్గు, కఫం, జలుబు చేసే అవకాశం ఉందని, వీటికితోడు మలేరియా, డెంగీ, టైఫాయిడ్, డయేరియా, చికెన్‌గున్యా వంటి జ్వరాలు ప్రబలుతాయంటున్నారు. చిన్న చిన్న జాగ్రత్తలు పాటిస్తే చాలు ఆరోగ్యం కాపాడుకోవచ్చని చెబుతున్నారు. వర్షాలకు భూగర్భజలం కలుషిత అవ్వడంతోనే ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని, ఈ నేపథ్యంలో కాచివడపోసిన నీటిని తాగాలని సలహా ఇస్తున్నారు. అధికార యంత్రాంగం ఎంత చేసినా ఏటా ఈ సీజన్‌లో రోగుల సంఖ్య విపరీతం. ఉదయం, రాత్రి అనే తేడా లేకుండా ఆస్పత్రిని ఆశ్రయించే వారే ఎక్కువ. ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు వివిధ ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. మరెంతో మంది మంచానికే పరిమితమై చికిత్స పొందుతున్నారు. ఈ నేపథ్యంలో ఇంటింటికీ వైద్యం అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఏ ఇంట్లో చూసినా రోగులే..

ఇప్పుడు ఏ ఇంట్లో చూసినా ఏదో ఒక ఆరోగ్య సమస్యతో బాధపడుతున్న వారే ఉన్నారు. ఆరోగ్య జాగ్రత్తలు పాటించకపోవడం, పౌష్టికాహార లోపం, పారిశుధ్య లోపం తదితర కారణాలతో పాటు ప్రస్తుతం మారిన వాతావరణ పరిస్థితులతో జనం ఒక్కొక్కరుగా అస్వస్థతకు గురవుతున్నారు. ఓ వైపు పారిశుధ్య చర్యలు ముమ్మరంగా చేసి పరిసరాలు శుభ్రంగా ఉంచడంతో పాటు మరోవైపు ప్రజలకు సకాలంలో వైద్యసేవలు అందేలా చూస్తే కొంతవరకు వ్యాధుల నుంచి బయటపడొచ్చు.

పీహెచ్‌సీలో మందుల కొరత..

పూసపాటిరేగలో పీహెచ్‌సీ(ప్రాథమిక ఆరోగ్య కేంద్రం)లో మందుల కొరత విపరీతంగా ఉంది. మెట్రోజెల్, పారాసిటమాల్ ఇంజిక్షన్ల కొరత ఏర్పడింది. ఇప్పుడు ఈ ఆస్పత్రిలో డిమాండ్‌కు సరిపడ మందులు లేవన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అసలే వర్షాకాలం..వ్యాధులు ఎక్కువగా తలెత్తే అవకాశం ఉందని ఇలాంటి పరిస్థితుల్లో మందులు లేకుంటే ఎలా అని జనం ప్రశ్నిస్తున్నారు. అధికార యంత్రాంగం అప్రమత్తం కావాలని, రోగులకు సకాలంలో వైద్యం, సరిపడ మందులు అందేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

గతంలో మెరుగైన వైద్యం..

గతంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ప్రజలకు నాణ్యమైన వైద్యం అందేది. నాడు–నేడు పథకం ద్వారా ఆస్పత్రులను ఆధునీకరణ చేసి, వాటిల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపరిచారు. అవసరమైన సిబ్బందిని కూడా రోగులకు అందుబాటులో ఉంచారు. దీనికితోడు ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా ఇంటింటికీ వైద్యం అందేలా చేశారు. అప్పటి పాలనకు ఇప్పటి పాలనకు తేడా గమనిస్తున్న ప్రజలు ఇప్పుడు కన్నా అప్పుడే బాగుందని అంతా అంటున్నారు. గతంలో మాదిరి గ్రామీణ జనానికి వైద్యం అందుబాటులోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఇంటింటికీ వైద్యం అందివ్వాలి..

గత ప్రభుత్వ హయాంలో మాదిరిగానే ఇప్పుడు కూడా ఇంటింటికీ వైద్యం అందివ్వాలి. ప్రస్తుతం వ్యాధుల కాలం నడుస్తున్నందున ప్రతి ఇంట్లో జ్వరాలు, జలుబు, దగ్గులతో బాధపడేవారు ఉన్నారు. దీనికితోడు దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, అస్వస్థతతో మంచానపడిన వృద్ధులు ఉన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఇంటి దగ్గరకే వైద్యసేవలు వచ్చేలా చర్యలు తీసుకోవాలి.

–ఐ.సన్యాసినాయుడు, రాజా వీధి, పూసపాటిరేగ

పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దూరం



పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా వ్యాధులకు దూరంగా ఉండొచ్చు. ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించడంతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి. వానాకాలం కావున కాచివడపోసిన నీటిని తీసుకోవాలి. ఆహారం తీసుకోవడానికి ముందు, తర్వాత చేతులు శుభ్రంగా కడుక్కోవాలి. ఆరోగ్య సమస్య వస్తే ఆస్పత్రిలో వైద్యులను సంప్రదించాలి.

–బి.కృష్ణచైతన్య, వైద్యాధికారి, పూసపాటిరేగ

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం



పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యమని, ప్రతిఒక్కరూ తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి వి.మల్లికార్జునరావు సూచించారు. డెంకాడ మండలంలోని గొలగాం గ్రామాన్ని శుక్రవారం ఉదయం ఆకస్మికంగా సందర్శించి, అక్కడి పారిశుధ్య పనులు, సిబ్బంది సేవలను పరిశీలించారు. ఉదయాన్నే ఇంటి వద్దకు వచ్చే చెత్తబండికి వేరు చేసిన తడి, పొడిచెత్త ఇవ్వాలని ప్రజలకు తెలిపారు. అనంతరం కొంతమంది గ్రామస్తులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన మెరుగుకు చర్యలు తీసుకోవాలని, ముఖ్యంగా ఈ గ్రామంలోని రక్షిత మంచినీటి పథకంలో క్లోరినేషన్ చర్యలు చేపట్టాలన్నారు. అక్కడి నుంచి చెత్త సంపద కేంద్రానికి వెళ్లి, చెత్త నుంచి ఎరువు తయారు చేయడంపై సిబ్బందికి సూచనలు చేశారు. ఆయన వెంట డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శులు భారతి, అనూష తదితరులు ఉన్నారు.

–డెంకాడ

సహస్ర దీపాలంకరణ



స్వామి వారికి ఊంజల్ సేవ చేస్తున్న అర్చకులు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం శ్రీసీతారామస్వామి దేవస్థానంలో సహస్ర దీపాలంకరణ కార్యక్రమం శుక్రవారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వెండి మండపంలోని శ్రీసీతారామస్వామి ఉత్సవ విగ్రహాలను మంగళవాయిద్యాలు, వేద మంత్రోచ్చరణల నడుమ ఊరేగింపుగా తీసుకువచ్చి, దీపారాధన మండపంలోని ప్రత్యేక ఊయలలో వేంచేపుజేశారు. అనంతరం దీపాలు వెలిగించి, స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఆ తర్వాత సహస్ర దీపాల శోభలో సీతారామస్వామికి ఊంజల్ సేవ జరిపించారు.

‘మత్తు’ జోలికి వెళ్లొద్దు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ బంగారు పాప

విజయనగరం క్రైమ్: మత్తుపదార్థాల జోలికి వెళ్లవద్దని స్థానిక టాస్క్‌ఫోర్స్ సీఐ బంగారు పాప సూచించారు. నగర పరిధిలోని కస్పా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్ప్రభావాలపై శుక్రవారం అవగాహన కల్పించారు. గంజాయి, ఖైనీ, గుట్కా, మద్యం, సిగరెట్ వంటి మత్తు పదార్థాలకు బానిసలై ఎంతో మంది యువత తమ బంగారు భవిష్యత్ నాశనం చేసుకుంటున్నారని, కన్నవారికి తీరని శోకం మిగుల్చుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిఒక్కరూ మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, మంచి అలవాట్లు అలవర్చుకోవాలని తెలిపారు.

వాడపల్లికి ఆర్టీసీ బస్సు సర్వీసు



బస్సును ప్రారంభిస్తున్న డిపో మేనేజర్ శ్రీనివాసరావు

విజయనగరం అర్బన్: వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయం వరకు ఏర్పాటు చేసిన ఆర్టీసీ బస్సు సర్వీసును స్థానిక ఆర్టీసీ డిపో ఆవరణలో డీఎం జె.శ్రీనివాసరావు శుక్రవారం ప్రారంభించారు. ప్రతి శుక్రవారం రాత్రి 8 గంటలకు విజయనగరం నుంచి బయలుదేరి శనివారం తెల్లవారుజామున 4 గంటలకు వాడపల్లి చేరుకుంటుందన్నారు. తిరిగి మరలా ఉదయం 9 గంటలకు వాడపల్లి నుంచి బయలుదేరి సాయంత్రం 4 గంటలకు విజయనగరానికి వస్తుందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఐ ఆదినారాయణ, ఎస్‌ఎం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నెల్లిమర్ల రూరల్: మండలంలోని పలు గ్రామాలకు శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతున్నట్లు ఆ శాఖ డీఈఈ పి.త్రినాధరావు ఓ ప్రకటనలో శుక్రవారం తెలిపారు. విద్యుత్ మరమ్మతు పనుల నేపథ్యంలో కొండవెలగాడ సబ్‌స్టేషన్ పరిధిలోని పారసాం, గెద్దపేట, చిన్నబూరాడపేట, పెద్దబూరాడపేటలతో పాటు టెక్కలి సమీపంలోని సెంచూరియన్ వర్సిటీ, గుర్ల మండలంలోని ఆనందపురం గ్రామానికి ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కరెంట్ ఉండదన్నారు. వినియోగదారులంతా ఈ విషయాన్ని గమనించి, సహకరించాలని కోరారు.

వితరణ

డెంకాడ: విజయనగరానికి చెందిన మార్వాడీ యువ మంచ్ సేవా సంఘం ప్రతినిధులు మండలంలోని సింగవరం, చొల్లంగిపేట ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నోట్‌పుస్తకాలు, భోజనం ప్లేట్లు శుక్రవారం వితరణ చేశారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు మణిశర్మ, అభిషేక్, సంజీవ్, ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వెబ్‌సైట్‌లో ప్రొవిజినల్ మెరిట్ జాబితా

విజయనగరం ఫోర్ట్: ప్రభుత్వ వైద్య కళాశాల, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రుల్లో పోస్టుల భర్తీకి సైకాలజీ సోషల్ వర్క్ పోస్టుకు సంబంధించి, ప్రొవిజినల్ మెరిట్ జాబితాను వెబ్‌సైట్‌లో పొందుపరిచామని ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ కె.పద్మలీల ఓ ప్రకటనలో శుక్రవారం తెలిపారు. ఓటీ టెక్నీషియన్, డెంటల్ టెక్నీషియన్, ల్యాబ్ అటెండెంట్, ఎలక్ట్రికల్ హెల్పర్, స్టోర్ అటెండర్ పోస్టులకు సంబంధించి స్పీకింగ్ ఆర్డర్స్ ఇచ్చినట్లు పేర్కొన్నారు.

సచివాలయ ఉద్యోగుల బదిలీల ప్రక్రియ ప్రారంభం



కౌన్సెలింగ్ ప్రక్రియ నిర్వహిస్తున్న కార్పొరేషన్ కమిషనర్ నల్లనయ్య

విజయనగరం: సచివాలయాల ఉద్యోగుల బదిలీల ప్రక్రియ ప్రారంభమైంది. మున్సిపల్ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వార్డు సచివాలయ ఉద్యోగులకు సంబంధించి విభాగాల వారీగా బదిలీలకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు జిల్లా పరిధిలోని పలు మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో విధులు నిర్వహిస్తున్న వార్డు సచివాలయాల ఉద్యోగులకు శుక్రవారం నుంచే బదిలీ ఉత్తర్వులు జారీ చేశారు. మొదటి రోజు బదిలీల్లో ఎడ్యుకేషన్ కార్యదర్శులు, అడ్మిన్లు, శానిటేషన్ కార్యదర్శులు, వెల్ఫేర్ కార్యదర్శుల బదిలీలు చేపట్టారు. జిల్లాలోని విజయనగరం కార్పొరేషన్, బొబ్బిలి, సాలూరు మున్సిపాలిటీలు, నెల్లిమర్ల నగర పంచాయతీలో ఉన్న సచివాలయ ఉద్యోగులకు మాన్యువల్ పద్ధతిలో బదిలీ కౌన్సెలింగ్ నిర్వహించడం జరుగుతుందని కార్పొరేషన్ కమిషనర్ పల్లి నల్లనయ్య తెలిపారు. ఎటువంటి సమస్యలు లేకుండా పారదర్శకంగా బదిలీల ప్రక్రియ చేపట్టడం జరుగుతుందన్నారు. ఖాళీల ఆధారంగా అభ్యర్థులు కోరుకున్న ప్రాంతాల్లో బదిలీలకు కౌన్సెలింగ్ చేపట్టడం జరుగుతుందన్నారు.

డైవర్షన్ రాజకీయాలు మానుకోవాలి

- వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పతివాడ సత్యనారాయణ



నెల్లిమర్ల రూరల్: ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలని అమలు సాధ్యం కాని హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం..హామీల అమలు పక్కనబెట్టి డైవర్షన్ రాజకీయాలు చేస్తోందని వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పతివాడ సత్యనారాయణ విమర్శించారు. ఇదే విషయమై ఆయన శుక్రవారం మాట్లాడుతూ చంద్రబాబు ప్రభుత్వం ఎన్నికల హామీల అమలును విస్మరించి, డైవర్షన్ పాలిటిక్స్‌లో దూసుకుపోతోందని ధ్వజమెత్తారు. హామీల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌లు రోజుకో కొత్త నాటకం ఆడుతున్నారని ధ్వజమెత్తారు. తిరుపతి లడ్డూ కల్తీ అయ్యిందని మొదట్లో.. ఇప్పుడు.. కారు ప్రమాదంలో వ్యక్తి చనిపోతే మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై కేసు నమోదు చేయించి డైవర్షన్ రాజకీయాలు కొనసాగిస్తున్నారన్నారు. అధికారంలోకి వచ్చి ఏడాదైనా రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం లేదని జనం ఆందోళన వ్యక్తం చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా డైవర్షన్ రాజకీయాలు మాని, ప్రజలకు మంచి చేసే రాజకీయాలు చేయాలని హితవు పలికారు.

ప్రమాదమని తెలిసినా..



ఎత్తు బ్రిడ్జి రోడ్డులో ట్రాక్టరు ఎక్కి ప్రయాణం చేస్తున్న కూలీలు

ప్రమాదమని తెలిసినా కొంతమంది వాహనదారులు మారడం లేదు. ఇష్టారాజ్యంగా వాహనాలపై ప్రయాణిస్తున్నారు. విజయనగరం జిల్లా కేంద్రంలో ట్రాక్టర్లు, మ్యాక్సీక్యాబ్‌లు, ఆటోలు, బైక్‌లపై ప్రమాదకరంగా పలువురు ప్రయాణిస్తున్న దృశ్యాలు శుక్రవారం ‘సాక్షి’ కంటపడ్డాయి. వాటిల్లో కొన్ని చిత్రాలను ఇక్కడ చూడొచ్చు. ఎన్ని ప్రమాదాలు జరిగినా వీరు మారరా అని పలువురు అంటున్నారు. జాగ్రత్తగా వెళ్లండి అని మరికొందరు సూచిస్తున్నారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం



కోట ప్రాంతంలో యువకుల ట్రిపుల్ రైడింగ్



బంగ్లా రోడ్డులో ఇలా సెల్‌ఫోన్ మాట్లాడుతూ బస్సును ఓవర్‌టేక్ చేస్తున్న ద్విచక్ర వాహనదారుడు



కలెక్టరేట్ రోడ్డులో ఆటోలో ఇలా ముందు సీటులో..



వై జంక్షన్ రోడ్డులో వ్యాన్‌పై కూర్చొని ఇలా..